# కవితా మహేంద్ర జాలం

-డా. ప్రసాదరాయ కులపతి

శ్రీనాథుడు పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో కొండవీడులో విద్యాధికారి. వేమారెడ్డికి, సింగ భూపాలునికి బద్ధవైరం. ఎంత శత్రుత్వమంటే సింగభూపాలుడు తాను తాంబూలం నమిలి ఉమ్మివేసే తమ్మపడిగానికి వేమారెడ్డి అని పేరు పెట్టి అందులో నిష్ఠీవనం-చేసి కసి తీర్చుకునే వాడు. అంత ప్రబల వైరం ఉన్నప్పటికి శ్రీనాథుడు వెళ్ళాడు.

సింగభూపాలుడు పాండిత్య పక్షపాతి, సాహిత్య ప్రియుడు కనుక వచ్చినవాడు ఎక్కడి వాడైనా, ఎవ్వడి వాడైనా విద్వాంసుడు కవి అయితే గౌరవించేవాడు. అందులోను అప్పటికి శ్రీనాథుడు విజయనగర సంస్థానంలో డిండిమభట్టు కంచుఢక్క పగులగొట్టించి కవి సార్వభౌమ బిరుదు స్థాపించి, కనకాభిషేకాన్ని పొంది వస్తున్నాడు. తగిన స్వాగత సత్కారాలు జరిగాయి. రాజు కొలువు తీరాడు. శ్రీనాథుడు సామాన్య ప్రశంసా పద్యా లేవో చెప్పాడు. గోష్ఠి మొదలైంది.

ఒక పండితుడు లేచి 'శ్రీనాథభట్టా! ఈ సమస్య పూరించండి'' అన్నాడు.

''కుక్కవో నక్కవో ఫణివో కోతివో పిల్లివో భూతపిల్లివో?''

శ్రీనాథునితో ఈ పద్య పాదం చదువుతూ ఆయన వైపే చూస్తూ అంటుంటే ఆయనను తిట్టినట్లు గానే వుంది. నువ్వు కుక్కవో, నక్కవో, పామువో, కోతివో, పిల్లివో, భూతపిల్లివో అని - భూత పిల్లి అంటే గ్రామాల్లో అర్ధరాత్రి వేళ పూజలు చేసి దిగంబరుడై రక్తాన్నం పొలిమేరల దగ్గర బలి వేసేవాడు.

శ్రీనాథుడు చిరునవ్వుతో ఒక్కసారి ఆ అడిగిన వ్యక్తివైపు చూశాడు. పద్య పూరరా వెలువడింది.

ఉ॥ తక్కక రావు సింగ వసుధావరు ఉర్థుల కర్థమిచ్చుచో
దిక్కుల లేని కర్ణుని దధీచిని ఖేచరు వేల్పు జెట్టు పెం
పెక్కిన కామధేనువు శిబీంద్రుని నెన్నెదు భట్ట! దిట్టవై
కుక్కవో నక్కవో ఫణివో కోతివో పిల్లివో భూత పిల్లివో

సింగ భూపాలుడు యాచకులకు దానం చేస్తుంటే ఎందుకయ్యా ఎప్పటి వారినో కర్ణుని, దధీచిని, కల్పవృక్షాన్ని కామధేనువును, శిబిని ఎన్నుతావు? నీవు కుక్కవో నక్కవో....

విడిచి పెట్టిన వానికే బాణం తిరిగి వెళ్ళి తగిలింది. అడిగిన భట్టు తలవంచుకున్నాడు. సింగ భూపాలుడు పొంగిపోయినాడు.

శ్రీనాథుని సాహితీ నందనంలో వికసించిన అందాల పారిజాత మా పద్యం. ఆ కవి సార్వభౌముని సాహిత్య జైత్రయాత్రలో ఇటువంటి ఘట్టాలు ఎన్నో! ఎన్నెన్నో!

[మినీ కథ]

# పేషెంట్

ఏ.ఎస్. రాజశేఖర్

అది గవర్నమెంట్ హాస్పిటల్‌లోని అసిస్టెంట్ సివిల్ సర్జన్ గది. విసుగ్గా కేస్ షీట్స్ పరిశీలిస్తున్నాడు డాక్టర్ పరాంకుశం.

అసలు కేస్ షీట్స్ పేషెంట్ బెడ్స్ దగ్గరే ఉంటాయి. కానీ సిస్టర్ చేత రూమ్‌లోకి తెప్పించుకొని పరిశీలిస్తున్నాడు.

ఇంతలో ఫోన్ మోగింది.

''హలో'' విసుగ్గా అన్నాడు పరాంకుశం.

డాక్టర్ పరాంకుశం మనిషి చాలా మంచివాడేకానీ విసుగెక్కువ. పేషెంట్స్‌ను ఆప్యాయంగా పలకరించి, ధైర్యం చెప్పేదటుంచి అసలు రోగులతో మాట్లాడనే మాట్లాడడు. అదీ ఆయనతో వచ్చిన చిక్కు.

''అయ్యా! డాక్టర్ పరాంకుశం గారేనా మాట్లాడేది?'' అవతలి నుంచి అడిగిం దొక కంఠం.

''ఔను. ఏం కావాలి?''

''మరేం లేదు సర్. కాజువాలిటీ వార్డులోని బెడ్ నెం. పది పేషెంట్ ఎలా ఉన్నాడు?'' ఆత్రతగా అడిగిం దవతలి కంఠం.

''బాగా ఉన్నాడు.'' చిరాగ్గా చెప్పాడు పరాంకుశం. 'అసలే కేస్‌షీట్స్ స్టడీయింగ్' అనుకుంటూ.

''అతని ప్రాణాని కేం ఫర్వాలేదు కదా సర్? దయచేసి చెప్పరండి.'' అభ్యర్థించిం దవతలి గొంతు.

ఇక దాంతో కాజువాలిటీ వార్డులోని కేస్ షీట్స్ తిరగేశాడు. పదోనెంబరు కేస్ షీట్‌ను పరిశీలనగా చూసి ''ప్రాణాపాయ మేమీ లేదు'' చెప్పాడు.

''అసలేమిటి సర్ అతనికి జబ్బు?''

''టైఫాయిడ్. అంతే. ప్రిలిమినరీ స్టేజ్ లోనే ఉంది. ఓ వారం రోజుల్లో వెళ్ళొచ్చు'' తనే చెప్పాడు పరాంకుశం.

''సార్! విసుక్కోకుండా ఈ ఒక్కదానికి సమాధానం చెప్పండి. ఆ పేషెంట్ పథ్యం ఉండాలా? భోజనం చెయ్యవచ్చా, చేయకూడదా?'

మామూలుగా అయితే ఇలాంటి ప్రశ్నలకు పరాంకుశం జవాబు చెప్పడు. కానీ అవతలి కంఠంలోని అభ్యర్థనను గమనించి తన విసుగును దాచుకున్నాడు.

''భోజనం చేయకూడదు. ఇపుడే కొంచెం తగ్గు ముఖం పట్టింది. కాబట్టి బ్రెడ్ - పళ్ళు మాత్రమే తినాలి'' చెప్పాడు విసుగు లేకుండా.

''చాలా కృతజ్ఞుణ్ణి డాక్టర్ గారూ! ఉంటాను.''

''ఆగండి. ఇన్ని ప్రశ్నలేశారు. మీ రతని కేమన్నా దగ్గర బంధువా, లేక అతనే మన్నా మీకు బావేనా?'' ఎక్కడో చదివిన జోక్ గుర్తొచ్చి అన్నాడు పరాంకుశం.

''లేదు సార్. ఆ పదో నెంబర్ పేషెంట్ మోహన్‌ను నేనే! ఆస్పత్రిలో చేరి ఇవ్వాళ్టైనా నా పరిస్థితేమిటో తెలియక ఆస్పత్రి ఎదుట ఉన్న మెడికల్ స్టోర్స్ నుంచి ఫోన్ చేస్తున్నాను. కృతజ్ఞతలు.''

అవాక్కైపోయాడు డాక్టర్ పరాంకుశం.